క్లుప్తంగా

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ

కవిటి: ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం (1902)కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశాన్ని అధికారులతో బుధవారం నిర్వహించారు. మండలంలో శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై చర్చించారు. నీటి ఎద్దడిని అత్యంత ప్రాధాన్యత అంశంగా భావించి, తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.సూర్యనారాయణ, పీఆర్ ఇంజినీర్ పి.ప్రవీణ్, సీఎస్‌డీటీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ మేనేజర్‌గా నారాయణరావు


నారాయణరావు

మందస: స్థానిక జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మేనేజర్‌గా సీది నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మేనేజర్‌గా పనిచేసిన ఎ.తులసీబాయికి ఇచ్ఛాపురం బదిలీగా కాగా, నారాయణరావు మెళియాపుట్టి బ్రాంచ్ నుంచి మందసకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన మందసలో డీసీసీబీ సేవలు మెరుగుపరుస్తామన్నారు. అర్హులకు కొత్త రుణాలు మంజూరు, పాత లోన్ల రికవరీ, డిపాజిట్ల సేకరణ లక్ష్యాల మేరకు చేస్తామన్నారు.

భూ ఆక్రమణదారులకు నోటీసులు

కోటబొమ్మాళి: మండలంలోని చిట్టివలస పంచాయతీ చవితిపేట గ్రామంలో సర్వే నంబర్ 203–3బీ లోని 1.64 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని సర్పంచ్ ఎస్.వెంకటరమణ టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి ఇటీవలి ఫిర్యాదు చేశారు. దీంతో సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు 12 మంది ఆక్రమణదారులను గుర్తించామని, వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధు బుధవారం తెలియజేశారు. ఈనెల 20వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో జరగనున్న రెవెన్యూ పబ్లిక్ హియరింగ్‌కు హాజరై భూమిని ఖాళీ చేస్తున్నట్లు అఫిడవిట్ సమర్పించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని నోటీసుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు సన్నాహాలు

కోటబొమ్మాళి: మండలంలోని శ్రీజగన్నాథపురం–బీర్లంగి–వింజాంపాడు గ్రామాలను కలుపుతూ 2 కిలోమీటర్ల మేర కొత్తగా రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక సత్యరాజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ అధికారులు రోడ్డు ఏర్పాటుకు సర్వే చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్వో లతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గోపినాయుడు, ఎంపీటీసీ ఎస్.కల్యాణి, ఫీల్డు అసిస్టెంట్ గుంట సోమేశ్వరరావు, వి.భాను చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీమెన్ మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలోని దేవునల్తాడ గ్రామానికి చెందిన సీమెన్ బుడగట్ల శ్రీనివాసరావు(32) బుధవారం చెన్నై వద్ద గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు షిప్‌లో పిట్టర్‌గా పనిచేస్తూ, శ్రీలంకలోని కొలంబో వెళ్తున్న క్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. సమాచారం కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు సర్పంచ్ తెరిపల్లి వరదరాజులు తెలిపారు. కాగా మృతునికి భార్య భవానీ, కుమార్తె ఉన్నారు. యువకుడి మృతిపై గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

సోంపేట: మండలంలోని బారువ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సలీం భాషా బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కళాశాల ఈ ఏడాది నాక్ గుర్తింపునకు వెళ్లేందుకు అవకాశం ఉందన్నారు. కళాశాలలో బీఎస్సీ ఎంపీసీ, సీబీజెడ్‌లో చెరో 50 సీట్లు, బీకాం జనరల్, బీహెచ్‌ఈలో చెరో 60 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

కవిటి: మండలంలోని శీమూరుకు చెందిన శివంగి గురుమూర్తి ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో పేదరికంలో మగ్గిపోతున్న ఆ కుటుంబానికి ఎస్‌జీఎఫ్ సంస్థ బాసటగా నిలిచింది. ఈ మేరకు బుధవారం శీమూరులోని వారి నివాసానికి వెళ్లి సంస్థ తరఫున రూ.7000 ఆర్థిక సాయాన్ని అందించారు. సంస్థ తరఫున చిన్నారులకు భవిష్యత్‌లోనూ అండగా ఉంటామని ప్రకటించారు.

నిలువెత్తు నిర్లక్ష్యం


ఆస్పత్రిలో తుప్పు పట్టే స్థితిలో ఉన్న ట్రామాకేర్ అంబులెన్స్


పాత ఆస్పత్రిలో విడిచిపెట్టిన జనరేటర్


మూలకు చేరుతున్న డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వారు ఇచ్చిన ఆక్సిజన్ ప్లాంట్



నిరుపయోగంగా ఉన్న పాత జిల్లా ఆస్పత్రి భవనం


ఆస్పత్రిలోని ఆక్సిజన్ పైపులు, కరెంట్ వైర్లు చోరీకి గురైన గదులు


ఆస్పత్రి బయట పడేసిన సామగ్రి

స్థానిక తెంబూరు రోడ్డులో 13 నెలల క్రితం నూతన జిల్లా ఆస్పత్రి భవనం నిర్మించడంతో పాత ఆస్పత్రి భవనం నుంచి కొంతమేర విలువైన వస్తువులు అక్కడికి తరలించి, మిగిలిన వస్తువులు విడిచిపెట్టారు. దీంతో ప్రస్తుతం విలువైన సామగ్రి తుప్పు పడుతుండడమే కాకుండా చోరీకి గురవుతున్నాయి. ఆస్పత్రి పాత భవనాల్లో ఉన్న సామగ్రిని కొత్త భవనంలోకి తరలించే క్రమంలో వైద్యులు, సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పాత ఆస్పత్రి భవనాల్లోనే విలువైన సామగ్రి ఉండిపోవడంతో పరిసర ప్రాంతాలకు చెందినవారు, ఆస్పత్రిలోని కొందరు దిగువ స్థాయి సిబ్బంది సామగ్రిని ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నట్లు సమాచారం. అలాగే ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న గదుల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి పాత భవనాలను కాపాడాలనే ఉద్దేశంతో గతంలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నియమించిన అధికారులు, తర్వాత వారిని తొలగించడంలో ఆంతర్యం ఎంటో అర్థం కావడం లేదని పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– టెక్కలి రూరల్

టీడీపీ నాయకులకు దమ్ము లేదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశీబుగ్గ: మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై తప్పుడు ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ, టీడీపీ నాయకులకు సవాల్‌ను స్వీకరించే దమ్ము లేదని పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. స్థానిక గాంధీ విగ్రహం వద్దకు జేసీబీతో బుధవారం వచ్చి మాట్లాడారు. అసత్య ప్రచారాలు చేసి రాజకీయం చేయడమే గౌతు కుటుంబ నైజమని ఆరోపించారు. నియోజకవర్గంలో 60 ఏళ్ల పాలనలో జరగని అభివృద్ధి, 4 ఏళ్లలో జరిగిందని తెలియజేశారు. ఉద్దానం రైతుల కోసం మాట్లాడే నైతిక అర్హత శివాజీకి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల భూ ఆక్రమణలు నిరూపిస్తే వెంటనే వాటిని తొలగిస్తామని సవాల్ చేశామని, కానీ నిరూపించడానికి ఒక్క టీడీపీ నాయకుడు కూడా రాకపోవడంతో ఆరోపణలు అవాస్తమని నిరూపణ అయ్యాయన్నారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంత ప్రజల నుంచి టాక్స్‌లకు అలవాటుపడిన కుటుంబానికి, నాలుగేళ్లుగా కలెక్షన్లు లేకపోవడంతో జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. శివాజీ వయసును చూసి గౌరవిస్తున్నామని, ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని సూచించారు. అభివృద్ధిపై అవాస్తవాలు మాట్లాడితే ఇకపై గట్టిగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పీవీ సతీష్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, పలాస, వజ్రపుకొత్తూరు నాయకులు ఉంగ సాయి కృష్ణ, ఉప్పలపల్లి ఉదయ్‌కుమార్, పలాస పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సనపల సింహాచలం, అధికార ప్రతినిధులు గుజ్జు జోగారావు, శిస్టు గోపి, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాసరావు, యువజన నాయకుడు పోతనపల్లి హరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి


కార్మికులతో మాట్లాడుతున్న అధికారి సూర్యనారాయణ

కంచిలి: ఎండల తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో కార్మికులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని యాజమాన్యాలకు సోంపేట కార్మికశాఖ సహాయాధికారి పి.సూర్యనారాయణ సూచించారు. మండల కేంద్రం కంచిలిలో నిర్మాణంలో ఉన్న వివిధ భవనాల కార్మికులను కలిసి, పని ప్రదేశాల్లో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి మంచినీరు, మజ్జిగ, గ్లూకోజ్ ప్యాకెట్లను సరఫరా చేశారు. కార్మికులకు వడదెబ్బ తగిలినట్లయితే వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలని ఆదేశించారు.

వాహన తనిఖీలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ బాలరాజు

సోంపేట: పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాగృతి కార్యక్రమంలో భాగంగా యువతకు వాహన తనిఖీలపై ఎస్‌ఐ ఎస్.బాలరాజు బుధవారం అవగాహన కల్పించారు. అపరాధ రుసుం గురించి వివరించారు. మహిళా పోలీసులు దిశ అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, జాగృతి సభ్యులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత


తక్షణ సాయం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి రేవతిపతివీధికి చెందిన సేనాపతి జగన్‌మోహన్ ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను ఆయన భార్య జయలక్ష్మికి ఎంపీపీ అట్ల సరోజనమ్మ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యర్ర అనంతయ్య, బసవల ధనుంజయ్, దుప్పల శ్రీను, అట్ల రాహుల్, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.మోహన్, వలంటీర్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు పనులను పర్యవేక్షించాలి'

ఇచ్ఛాపురం రూరల్: రూరల్ ఐసీడీఎస్ పరిధిలో ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని సీడీపీవో పురాణం నాగరాణి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏసీడీపీవో వై.లావణ్య పాల్గొన్నారు.

ఈదురు గాలుల భీభత్సం

కోటబొమ్మాళి: మండలంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం భీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో విరుచుకుపడింది. అర్ధరాత్రి వేళలో జరిగిన ఈ పరిణామంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. పగలంతా అధిక ఉష్ణోగ్రతతో అల్లాడిన జనంలో, రాత్రి సమయంలోని వర్షంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గాలులు, పిడుగులు విరుచుకుపడడంతో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆస్తినష్టం భారీగా ఉండే అవకాశం ఉంది.

గడప గడపలో సంతోషాలు



ర్యాలీగా ప్రజల వద్దకు వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- ధర్మపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలోని ప్రతి గడపలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని ధర్మపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని తెలియజేశారు. అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ డి.లోకేశ్వరరావు, ఇచ్ఛాపురం, కవిటి ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్‌లు పిట్ట రుక్మిణి, దుక్క ధనలక్ష్మి, ఎంపీటీసీ పిట్ట హేమలత, కారంగి మోహనరావు, దక్కత నూకయ్యరెడ్డి, బీన ఢిల్లీరావు, పిట్ట విశ్వనాథం, పిట్ట మామయ్య, రాంపత్ని చిట్టిబాబు, పిట్ట బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్తు జన్మదిన వేడుకలు


రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: మండలంలో కొత్తపుట్టుగలోని తన నివాసంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముందుగా స్థానిక ఆలయంలో అభిమానులు ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిమానుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయనకు ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, కంచిలి జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, ఇచ్ఛాపురం జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం ఎంపీపీలు కె.పద్మ, పి.దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, సీడాప్ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, నర్తు నరేంద్రయాదవ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట

కంచిలి:

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అన్నారు. మండలంలోని మండపల్లి ఆర్‌బీకే పరిధిలో శ్రీశ్రమశక్తి సీహెచ్‌సీ గ్రూప్ సభ్యుడు దిక్కల శోభన్‌బాబు, రుంకు బాబూరావులకు 40 శాతం సబ్సిడీతో మంజూరైన రూ.15 లక్షలు విలువ గల ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లను బుధవారం అందించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లద్దుకేశవపాత్రో, స్థానిక నేత మాదిన ధనుంజయ, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.


ట్రాక్టర్ ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

నర్తుకు ఘన స్వాగతం


కాశీబుగ్గ: పలాసలో ఎమ్మెల్సీ నర్తు దంపతులను సత్కరిస్తున్న నాయకులు


ఇచ్ఛాపురం: ఎమ్మెల్సీ నర్తుకు అభినందనలు తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

ఇచ్ఛాపురం: శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారి స్వగ్రామానికి వచ్చే క్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావుకు ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం ఘన స్వాగతం పలికారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, ఎంపీపీలు బోర పుష్ప, పైల దేవదాస్‌రెడ్డి, ఏఎంసీ బాబురావు, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అన్వేష్, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, కోకోనట్ బోర్డు మాజీ చైర్మన్ జోహార్ ఖాన్‌లు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. వారితో పాటు పార్టీ ముఖ్య నేతలు నర్తు నరేంద్ర, పిలక సంతోష్, కడియాల ప్రకాష్, చాట్ల తులసీదాస్, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, పరపటి కోటిరెడ్డి, పాడుగు కామేష్, గోవింద్‌రెడ్డి, చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

కాశీబుగ్గ: ప్రమాణ స్వీకారం తర్వాత తొలిసారి జిల్లాకు విచ్చేసిన ఎమ్మెల్సీ నర్తు రామారావుకు పలాస రైల్వేస్టేషన్‌లో జిల్లా యాదవ సామాజిక వర్గం నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రాపాక చిన్నారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కసవయ్య యాదవ్, పలాస నియోజకవర్గ అధ్యక్షుడు మద్దిల హరినారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ జినగ సీతారాం, యాదవ సంఘ జిల్లా కార్యదర్శి ఐతి ఈశ్వరరావు, తలగాన శంకరరావు, పాలిన కృష్ణారావు, జినగ శ్యాం, జినగ సీతయ్య, కిక్కర ఆదినారాయణ, జినగ తిరుపతి, కొండే రాజారావు, పాలిన తిరుపతి, డొక్కర దిలీప్‌కుమార్ యాదవ్, రాజగోపాలరావు తదితరులు ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం అనంతరం ఇచ్ఛాపురం మండలానికి వచ్చిన నర్తు రామారావుకు అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఈదుపురం చేరుకోగా కండ్రవార్డు ప్రజలు పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, చాట్ల తులసిదాసురెడ్డిలు పాల్గొన్నారు.

మంత్రి అప్పలరాజుకు ధన్యవాదాలు


మంత్రి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలుపుతున్న నెయ్యిల కుల సంక్షేమ సంఘం సభ్యులు

కాశీబుగ్గ: పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు రాష్ట్ర నెయ్యిల కుల సంక్షేమ సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలిపి బుధవారం సత్కరించారు. చేపల చెరువుల లీజు ఆర్డర్స్ ఇప్పించేందుకు స్వయంగా చొరవ తీసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు సింగిడి సూరిబాబు, నెయ్యిల నాగభూషణ్, మురముళ్ల శ్రీనుబాబు, సింగిడి గణేష్, గోపాల్, రామమూర్తి, శ్రీను, సాంబ, గురుమూర్తి, నర్సింగరావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అప్పలస్వామి

కంచిలి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్పందనకు వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో అధికార యంత్రాంగం పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ కె.అప్పలస్వామి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు వారంలో ఒకసారి స్పందనలో వచ్చిన వినతులపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వినతులకు నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలని, లేదంటే కలెక్టర్ స్వయంగా పరిశీలకులుగా ఉన్నందున క్రమశిక్షణ చర్యలకు గురవుతారని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.హైమావతి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస రెడ్డి, మండల విద్యాశాఖాధికారి ఎస్.శివరాంప్రసాద్, మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ, ఏఎస్‌ఐ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం–బెల్లుపడ కూడలిలో బుధవారం రూరల్ ఎస్‌ఐ వి.రమేష్ వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా అనుమతి పత్రాలు ఉండాలని, లైసెన్స్, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధించడం జరుగుతుందన్నారు.